ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
సోమవారం 27 జనవరి 2025



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు



ఖిలా వరంగల్ కోటలో జరిగిన గణతంత్ర వేడుకలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

పోరాటమే స్ఫూర్తి కావాలి





- త్యాగధనులను స్మరించుకోవాలి
- నాలుగు పథకాలతో ప్రజల్లో వెలుగులు
- అభివృద్ధి పథంలో వరంగల్ జిల్లా
- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- ఖిలా వరంగల్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వరంగల్ సిటీ, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని, త్యాగాలను స్మరించుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగాన్ని రచించుకుని, 26 జనవరి 1950 నుంచి అమలులోకి తెచ్చుకున్నామని, అప్పటినుంచి దేశ ప్రజలందరూ స్వేచ్ఛ, సమానత్వంతో జీవిస్తున్నారని అన్నారు. ఆదివారం ఖిలా వరంగల్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ ఈ నాలుగు నూతన పథకాలను పజలకు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు నేస్తం, వరి పంటకు బోనస్, ఆయిల్ పామ్ పంట విస్తరణకు ప్రోత్సాహకాల వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500లు బోనస్ ఇస్తోందన్నారు. వరంగల్ జిల్లాలో 10వేల 956 మంది రైతుల నుంచి సన్నరకం ధాన్యాన్ని సేకరించామని వివరించారు. 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని చేసిన భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ భరోసా కింద యేడాదికి రూ.12 వేలు అందేందుకు చర్యలు తీసుకుంటోందని అన్నారు. అదేవిధంగా సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇస్తోందని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3500ల చొప్పున ఇండ్లను మంజూరు చేసిందన్నారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు మరమ్మతు చేసి భూమిలేని నిరుపేదలకు కేటాయిస్తామన్నారు.

వరంగల్ జిల్లాలో 2 లక్షల 66 వేల 661 కుటుంబాలకు ప్రతీ నెల 49వేల 782 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని, జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,32,763 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 28 వేల మంది రైతులకు రూ.308 కోట్లు చెల్లించామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు 200 లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఐదు లక్షలు ఉన్న ఆరోగ్య శ్రీ కవరేజీని రూ.10 లక్షలకు పెంచామని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా ఉన్నతీకరించామని, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో 72 వేల ఎకరాలకు సాగునీరందించామని, జిల్లాలో రూ.14 కోట్ల 85 లక్షలతో చెక్ డ్యాములు నిర్మించామని అన్నారు. గురుకుల విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం డైట్‌కు, 200శాతం కాస్మెటిక్ చార్జీలను పెంచామన్నారు. రైతాంగ భూసమస్యల నివారణకు ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టం తెచ్చిందని, ఈ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 54వేల సమస్యలను త్వరతలోనే పరిష్కరిస్తుందని అన్నారు. మత్సశాఖ ద్వారా ఈ సంవత్సరం 7 వేల 762 టన్నుల చేపలు, 235 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేశామని, 100శాతం సబ్సిడీతో రిజర్వాయర్లు, మీడియం మైనర్ ఇరిగేషన్ చెరువులలో 95 లక్షల 91 వేల చేప పిల్లలను సబ్సిడీపై సరఫరా చేశామని అన్నారు. వరంగల్ మహా నగరపాలక సంస్థలో రూ.43 కోట్లతో 176 అభివృద్ధి పనులు చేపట్టామని, స్మార్ట్ సిటీ కింద రూ.499 కోట్లతో 66 అభివృద్ధి పనులు మంజూరయ్యాయని అన్నారు. వరంగల్ బస్ స్టేషన్‌ను రూ.75 కోట్లతో అత్యంత ఆధునికంగా ఐదు అంతస్తులతో నిర్మిస్తున్నామని అన్నారు.



అన్నదాతలపై రాసిన గీతాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ ప్రాంతంలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మొదటగా వెంపటి శ్రావణి ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు శ్రీ విష్ణురా జే బజే అంటూ నర్తించి ఆకట్టుకున్నారు. గీసుగొండ మండలంలోని ఏవీవీ లిటిల్ జెమ్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బోనాలు, బతుకమ్మ, జాతీయ జెండాలతో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు. నెక్కొండకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చెన్నారావుపేట మండలం జల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు రాయపర్తి కేజీబీవీ విద్యార్థులు దేశభక్తి గీతాలతో అలరించారు. అనంతరం వరంగల్ వ్యవసాయమార్కెట్ చైర్మన్ బి.రవీందర్‌రెడ్డి అన్నదాతలపై రూపొందించిన పాటల సీడీని కలెక్టర్ సత్యశారద ఆవిష్కరించారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

వరంగల్ జిల్లాలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులను ప్రభుత్వం వేగవంతం చేసిందని, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్రీన్‌జోన్ ఏర్పాటు చేస్తోందని, రోడ్ల కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల కోసం రూ.179 కోట్లు కేటాయించిందని అన్నారు. పార్క్ కింద భూములు కోల్పోయిన 863మంది రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు.

మామునూరు విమానాశ్రయం

త్వరలోనే మామునూరు విమానాశ్రయం ఏర్పాటు అవుతుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.205 కోట్లు విడుదల చేసిందని అన్నారు. వరంగల్ నగరంలో

మిగతా 6వ పేజీలో...

పాత సెల్‌ఫోన్‌ల కొనుగోలు పేరిట

సైబర్ మోసాలు

- గ్రామాల్లో, కాలనీల్లో సంచరిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



ముఠా సభ్యులు సేకరించిన పాత సెల్‌ఫోన్‌లు

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు గ్రామాల్లో, పట్టణాల్లో పాత ఇనుప సామాను, కాలం చెల్లిన నూకలు, చింతపండు కొంటుండడం చూశాం... కానీ కొత్తగా పాత సెల్‌ఫోన్లు కొంటామంటూ గ్రామాలు, నగరాల్లో బిహార్ ముఠా సభ్యులు సంచరిస్తూ నయా మోసానికి తెరలేపారు. వినియోగం లేని సెల్‌ఫోన్‌ను రూ.100 నుంచి 1000లోపే కొనుగోలు చేసి సెల్‌ఫోన్ యాజమాని, వారి కాంటాక్ట్ లిస్టులో ఉన్న వ్యక్తుల నుంచి లక్షల్లో డబ్బులను కొల్లగొడుతున్నట్లుగా తెలుస్తోంది. ఐదు నెలల కిందట రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని పవర్ హౌస్‌లో పాత్ సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేసే ముఠా పట్టుబడగా ఆసక్తికరమైన విషయాలు రాబట్టారు. తెలంగాణలో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్‌లను కొన్ని భాగాలు మార్చి జామ్‌తారా, దేవ్‌ఘర్, జార్ఖండ్‌కు తరలించి అక్కడ సైబర్‌క్రైమ్‌కు పాల్పడే నేరగాళ్లకు విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసు విచారణలో తేలింది. సైబర్ నేరగాళ్లు వారి సిమ్‌లను ఉపయోగించి పాత సెల్‌ఫోన్ యాజమాని ఖాతాను లూటీ చేస్తున్నట్లుగా పోలీసులకు దృష్టికి వచ్చింది. కాగా, అదే తరహాలో బిహార్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ పోలీసు డివిజన్‌లో గదిని అద్దెకు తీసుకొని గ్రామాలు, కాలనీల్లో వేలాదిగా పాత సెల్‌ఫోన్‌లు సేకరించి సైబర్ నేరగాళ్లకు అప్పగించే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయం కమిషనరేట్ పరిధిలోని ఓ ప్రత్యేక విభాగం దృష్టికి వచ్చినప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఇందిరమ్మ ప్రభుత్వంలోనే

పేదలకు న్యాయం





రైతు భరోసా పత్రంతో వృద్ధురాలు | పెంబర్తి గ్రామంలో మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డు
- వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా
- భూమిలేని ప్రతీ పేద కుటుంబానికి ఆత్మీయ రైతు భరోసా
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పెంబర్తిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

5



మల్లన్న సన్నిధిలో

బోనాలు, పట్నాలు

ఐనవోలు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో భాగంగా రెండో ఆదివారం భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్మరింతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. రథం(శావ)లో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ భక్తులు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్‌ను తలపించేలా

రేవంత్‌రెడ్డి పాలన

- పేద ప్రజల కోసమే ముఖ్యమంత్రి ఆలోచన
- పదేళ్లలో చేయలేని పనులు ఏడాదిలో చేస్తున్నాం..
- బీఆర్ఎస్ నేతల ఆరోపణలు అర్థరహితం

4

- గ్రామాల్లో కూర్చొని, అధికారులను పంపించి పథకాలు ఇస్తున్నాం..
- రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వెంకట్రావుపల్లి (బొక్కలగూడెం) గ్రామంలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



మామునూరు వద్ద అదుపుతప్పిన కంటైనర్ లారీ, స్తంభాలు పడడంతో నుజ్జు నుజ్జు అయిన ఆటో



మృతులు ఆర్తి చౌహాన్, కన్నా చౌహాన్, సంతోష్ చౌహాన్, కిరణ్ చౌహాన్

నలిగిన వలస బతుకులు

కంటైనర్ స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఘోర ప్రమాదం
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

5

వలస జీవులను మృత్యువు కంటైనర్ లారీ రూపంలో కబళించింది. పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చిన వారిపై విధి పగబట్టినట్లు అయింది. బతుకుదెరువు కోసం తాము తయారు చేసిన కత్తులు, ఈలపీటలు అమ్ముకునేందుకు ఆటోలో వెళుతున్న నిరుపేద కుటుంబంపై కంటైనర్‌లోని ఇనుప స్థంభాలు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. స్తంభాల బరువుకు దేహాలు చితికిపోయాయి. ఈ ఘటనలో అదే కుటుంబంలో ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర ప్రమాదం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది.

- మామునూరు(ఆంధ్రజ్యోతి)

ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవుట్ స్టాండింగ్ పర్ఫార్మెన్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయిలో 13 మందిని ఎంపిక చేయగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అందులో ఒకరు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

నాగార్జున హోండా ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న నాగార్జున హోండా షోరూం సిబ్బంది

మట్టెవాడ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ ములుగు రోడ్డులోని నాగార్జున హోండా షోరూమ్ ఆధ్వర్యంలో ఆదివారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షోరూం సిబ్బంది, మేనేజర్‌లు ఎంజీఎం సర్కిల్ వరకు హెల్మెట్ ధరించి వాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు బహుమతులను అందచేశారు ఈ సందర్భంగానాగార్జున హోండా షోరూం మేనేజర్ సిద్ధార్థ మాట్లాడుతూ.. వాహన చోదకులు రహదారి భద్రత నియామలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ సిద్ధార్థ, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శ్రీచేతన్ శౌర్య సత్తా

● బాలుర డబుల్స్‌లో స్వర్ణం, సింగిల్స్ విభాగంలో రజతం కైవసం



బాలుర డబుల్స్‌లో స్వర్ణ పతకం సాధించిన శ్రీచేతన్ శౌర్య జోడికి ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలిలోని సాయి గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహించిన అనంత్ బజాజ్ మెమోరియల్ తెలంగాణ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2025లో హనుమకొండకు చెందిన సామల శ్రీచేతన్ శౌర్య అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ, రజత పతకాలను సాధించాడు. అండర్-15 బాలుర డబుల్స్‌లో స్వర్ణ పతకం, సింగిల్స్ విభాగంలో రజత పతకం కొల్లగొట్టి అందరి మన్ననలను పొందుతున్నాడు శ్రీచేతన్ శౌర్య. ఈ మేరకు శ్రీచేతన్‌శౌర్యను వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

వైఎస్‌ను తలపించేలా రేవంత్‌రెడ్డి పాలన

- పేద ప్రజల కోసమే ఆయన ఆలోచన
- రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వెంకట్రావుపల్లి(బొక్కలగూడెం) గ్రామంలో పథకాల ప్రారంభోత్సవం



వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావుపల్లిలో లబ్ధిదారులకు పథకాలను పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

వర్ధన్నపేట రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని తలపించేలా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఉందని రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. నిరంతరం పేద ప్రజల కోసమే ఆయన ఆలోచిస్తున్నారని అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావుపల్లి(బొక్కలగూడెం) గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 30 మంది, 108 మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు, రైతు భరోసా కింద 347 మందికి, 91 మందికి ఇందిరమ్మ ఇళ్లు అందించి నాలుగు పథకాలను ప్రారంభించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాడని తెలిపారు. అందులో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారని తెలిపారు. రైతులకు రుణమాఫీ రూ.2లక్షల వరకు ఏకకాలంలో చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రూ.30వేల వరకు చేసి మిగతా డబ్బులు రైతులే చెల్లించే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. అధికారులను ఇంటింటికీ పంపించి ప్రతి ఒక్కరూ డేటాను సేకరించి అర్హులైన వారికి పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ధరణి పోర్టల ద్వారా వేల ఎకరాల భూములను బీఆర్‌ఎస్ నేతలు కొల్లగొట్టారని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి భూభారతిని తీసుకుని మీ భూములు మీకు దక్కే విధంగా చేస్తున్నాడని గుర్తు చేశారు. సన్న వరికి రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. పంట పండించడానికి యోగ్యమైన వ్యవసాయ భూమికి రైతు భరోసా అందిస్తామన్నారు. ప్రజాధనం వృథా అయ్యేలా ఇతరత్రా వాటికి రైతు భరోసా ఇవ్వబోమని తెలిపారు. అనర్హులు తప్పుడు సమాచారం ఇచ్చి పథకాలు పొందితే వాటిని రద్దు చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. అందరి సమక్షంలో అర్హులైన వారిని గ్రామ సభలో ఎంపిక చేస్తామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వంద మాటలు చెప్పి ఒక్క పనిచేయలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇస్తానని ప్రజలను మభ్యపెట్టాడని విమర్శించారు. ప్రజలు గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు చెడగొట్టే ప్రయత్నం చేసినప్పుడు వారిని నిలువరించి ప్రశ్నించాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులను ఎంపిక చేశామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మరిన్ని ఇవ్వాలి..

వర్ధన్నపేట నియోజకవర్గంలో విలీన గ్రామాలతో పాటు దళిత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి మరో 1500 ఇండ్లు మంజూరు చేయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంత్రి కొండా సురేఖను కోరారు. ప్రజాపాలన పథకాల ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి యేడాదిలోనే హామీలన్నీ నెరవేర్చే దిశగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. అధికారులు ఇంటింటికీ తిరిగి అర్హులైన వారిని పారదర్శకంగా గుర్తించారని స్పష్టం చేశారు. అర్హులపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులు ఉంటే మళ్లీ ఫిర్యాదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు కుల్ల యాకాంతం, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, బాషా తదితరులు పాల్గొన్నారు.

బీవీ రావు కోళ్ల పరిశ్రమకు చేసిన సేవలు ఎనలేనివి

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

న్యూశాయంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీరావు కోళ్ల పరిశ్రమకు చేసిన సేవలు ఎనలేనివని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో ఆదివారం బీవీరావు 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా పౌల్ట్రీ పార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్తినేని ధర్మారావు బీవీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరటికే పరిమితమైన కోళ్లను బీవీరావు పరిశ్రమ స్థాయికి తీసుకువచ్చి పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పించిన తీరును వివరించారు. కోళ్ల రైతులు నష్టాల ఊబి నుంచి బయటపడాలంటే జాతీయ స్థాయిలో ఎగ్ బోర్డు ఉండాలన్నారు. అనంతరం బీవీరావు స్మారకార్థం ప్రజలకు ఉడకబెట్టిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెక్ వరంగల్ జోన్ మార్కెట్ సూపర్‌వైజర్ కె.వినయ్ పటేల్, నెక్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు ఉచితంగా ఉడకబెట్టిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు, ధర్మారావు

ఎస్సార్‌యూలో ఘనంగా ముగిసిన స్పార్కిల్ వేడుకలు





సర్టిఫికెట్లు అందిస్తున్న వరదారెడ్డి, పాటలు పాడుతున్న గాయని షణ్ముఖ ప్రియ

హసన్‌పర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్పార్కిల్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఎ.వరదారెడ్డి, ప్రోచాన్సలర్ ఎ.మధుకర్‌రెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఏవీవీ.సుధాకర్, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్లు శశిధర్‌రెడ్డి, భావన, పానిశ్రీలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులప్రతిభను వెలుగులోకి తెచ్చే విధంగా ఈ వేడుకలు కొనసాగాయి. కాక్టైల్ థీమ్ ప్రదర్శన ద్వారా ఆకర్షణీయ ప్రదర్శనల శ్రేణి ప్రారంభమైంది. ప్రముఖ గాయని షణ్ముఖ ప్రియ పాటలు సభికులను ఉర్రూతలూగించింది. విద్యార్థులు ఆమె పాటలతో నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా వెల్‌కం డాన్స్, క్లాసికల్ ఫ్యూజన్ , హనుమాన్ థీమ్ ప్రదర్శన భారతీయ పురాణగాథలను, శక్తిని ప్రతిబింబిస్తూ ప్రేక్షకులను అలరించింది. డ్రామా యాక్ట్ భావోద్వేగపూరితంగా కొనసాగగా, ఫోక్ థీమ్ ప్రదర్శణ భారతీయ సంప్రదాయాలను వికసింపజేసింది. గ్యాంగ్‌స్టర్ థీమ్ డ్యాన్స్ ఉత్సాహాన్ని నింపగా ఫ్యాషన్ ర్యాంప్ వాక్ షో సభికులను అబ్బురపరిచింది. సూట్స్ అండ్ బూట్స్ థీమ్ ప్రదర్శన ఆకర్షణీయంగా సాగగా సే నో టూ డ్రగ్స్ అవేరెనెస్ యాక్ట్ సామాజిక సందేశాన్ని వ్యక్త పరిచింది. కోర్ 3 గ్రూప్ యాక్ట్ సమన్వయం, సృజనాత్మకతను చాటాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-1 డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226047 నంబర్‌కు సంప్రదించి రూట్లల్లో పలు సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రయాణికులను కోరారు.

ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి

- మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం అభినందనీయం
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో ఎస్సీ జనాభా 18 నుంచి 19 శాతం వరకు పెరిగినందున ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతంకు పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కమిషన్లు, చర్చల పేరుతో కాలయాపన చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సూచించారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేసిన మంద క్రిష్ణకు పద్మశ్రీ రావడం అభినందనీయమన్నారు. పద్మశ్రీ రావడం మాదిగ, మాదిగ ఉపకులాలకు దక్కిన గౌరవం అన్నారు. సెక్యులర్ అనే పదాన్ని రాజ్యాంగం నుంచి తొలగించాలని చూస్తున్నారని, రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలు చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం దళితులు, మైనార్టీలపై వివక్షత చూపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించడం గర్వకారణమని అన్నారు.

సమావేశంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్యాశిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్‌రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామకృష్ణ, లింగాజీ, జేసీ రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

- మామునూరు ఏసీపీ బి.తిరుపతి
- అట్టహాసంగా ఏకశిల జూనియర్ కళాశాలల స్పార్కింగ్ సెలబ్రేషన్స్



మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ తిరుపతి

ఐనవోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులుగా మారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మామునూరు ఏసీపీ బి.తిరుపతి తెలిపారు. ఏకశిల జూనియర్ కళాశాలలు సంయుక్తంగా స్పార్కింగ్ సంబరాలు అట్టహాసంగా పున్నేలు ఏకశిల ఈ టెక్నో పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడుతూ.. కాలం విలువ గుర్తించిన వారే విజయ తీరాలు అందుకుంటారన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సినీ గేయ రచయిత గాయకుడు కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ.. విద్యే విత్తనం విద్యార్థి దేశ భవిష్యత్తును పండించే తోటమాలని తెలిపారు. అధ్యక్షత వహించిన చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిల విద్యార్థులు అనేక పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలు ఏకశిల కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో చాటుతున్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ పోటీ పరీక్షల్లో అర్హులైన విద్యార్థులకు నగదు పారితోషికం ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, మచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాలప్రిన్సిపల్ ఇ.తిరుపతిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కేయూ క్యాంపస్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసంనారాయణ ఉద్బోధించారు. రెండు రోజులుగా నెహ్రూయువకేంద్రం, గణితశాస్త్ర విభాగం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కేయూలో యువతకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ముగింపు సదస్సులో ఈసం నారాయణ రెండు రోజుల పాటు శిక్షణ పొందిన యువత, విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేశారు.

పరేడ్ గ్రౌండ్‌లో సందడే సందడి..

- ఆకట్టుకున్న గణతంత్ర కార్యక్రమాలు
- పోలీసు కవాతు, విద్యార్థుల నృత్యాలు
- స్వాతంత్ర్య యోధులకు సన్మానం
- ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వరంగల్ క్రైం/హనుమకొండ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవ వేడులకను పురస్కరించుకొని ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీస్ కవాతు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాలకు ముందుగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరించారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. అడ్మిన్ రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణన్‌రాజు సారథ్యంలో కమిషనరేట్‌లో వివిధ విభాగాలకు చెందిన పోలీసులు ఆరు ప్లాటూన్స్‌గా ఏర్పడి మార్చ్‌ఫాస్ట్ చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై ప్రసంగించారు. తర్వాత వేదికకు ఎడమవైపు ఉన్న గ్యాలరీలో కూర్చొన్న స్వాతంత్ర్య సమర యోధుల దగ్గరికి సీపీ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా యంత్రాంగంతో కలిసి వెళ్లి శాలువాలతో సత్కరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులతో పాటు వేడుకలను చూసేందుకు తరలొచ్చిన సందర్శకులను ఆకట్టుకున్నాయి. మొదటగా మడికొండ టీజీఎస్‌డబ్ల్యూఆర్ విద్యార్థినులు, రెండో నృత్యం మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన దివ్యాంగుల ప్రదర్శన, మూడో నృత్యంగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి జడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన బాలికల ప్రదర్శన, నాలుగో నృత్యంగా ఎర్రగట్టు గుట్ట సమీపంలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ బాలికల ప్రదర్శించిన నృత్యాలు అలరింపజేశాయి. నృత్యాల అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులతో కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్ గ్రూప్ ఫొటో దిగి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

బోసిపోయిన స్టాల్స్.. సందర్శకులు నిల్..

వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, సీపీ సందర్శించి స్టాల్స్‌లోని ఉన్న పరికరాలను పరిశీలించారు. డీఆర్‌డీఏ, మెప్మా, అగ్రికల్చరల్, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమలు, జిల్లా ఆరోగ్యశాఖ, చైల్డ్ అండ్ ఉమెన్, మత్స్య శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కాగా, 12 స్టాల్స్ నిర్వహణకు ఏర్పాటు చేయగా 9 మాత్రమే ఏర్పాటు చేశారు. మిగతా 3 స్టాల్స్‌ను ఖాళీగానే కనిపించాయి. ఉన్న స్టాల్స్‌కు సందర్శకులు లేక ఆదరణ కరువైంది. ప్రచారం కల్పించడంలో సైతం విఫలమైనట్లుగా తెలుస్తోంది. కేవలం స్టాల్స్‌లో సిబ్బంది, అధికారులు సెల్ఫీలకు మాత్రమే ఉపయోగపడ్డాయి.

అవార్డుల ప్రదానోత్సవం

విధుల్లో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల్లోని ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా సామాజిక సేవల్లో ఉన్న వ్యక్తులను సైతం గుర్తించి ప్రశంసా పత్రం అందజేశారు. ముందుగా పోలీసుశాఖలో జాతీయ స్థాయిలో అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట పతకాలు పొందిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ బాలాజీ వరప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి, మహేశ్వర్, కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌కు సీపీ, కలెక్టర్ మెడల్స్ అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రిపబ్లిక్‌డే వేడుకలను పురస్కరించుకొని రవాణా శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్, డ్రామా పోటీల్లో విజేతలకు నిలిచిన విద్యార్థులకు కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్‌తో కలిసి డీటీసీ పుప్పాల శ్రీనివాస్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



క్యాతంపల్లిలో పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- క్యాతంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు పథకాల పంపిణీ

ధర్మసాగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు పథకాలను వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది గడిచి రెండో ఏడులోకి అడుగు పెడుతున్నామన్నారు.

ఈ క్రమంలో పేదలు, రైతుల గుండెల్లో ఇందిరమ్మ బొమ్మ ఉండేలా ప్రజల కోరికలు తీర్చేలా పథకాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 606 మండలాల్లో మండలానికో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు. క్యాతంపల్లిలో నాలుగు సంక్షేమ పథకాలు అధికారికంగా ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. రూ.21వేల కోట్లతో 2.60 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి వారి ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. గత ఏడాది నుంచి ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రభుత్వం అమలు చేసిందని కొనియాడారు. గత ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ.10వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12వేలు అమలు చేసిందన్నారు. 2004. నుంచి 2014వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇండ్లను ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 3500 ఇళ్ల కంటే అదనంగా ఇచ్చేలా కృషి చేస్తామన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. గ్రామంలోని 713మందికి రైతు భరోసా ఇస్తున్నామని, 43 మంది భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామన్నారు. 207మందికి కొత్త రేషన్‌కార్డులను ఇవ్వబోతున్నామని తెలిపారు.

355 మందికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నామని తెలిపారు. గ్రామ సభ ద్వారా సుమారు 1300మంది లబ్ధిదారులకు నాలుగు పథకాల ద్వారా లబ్ధి జరుగనుందన్నారు. రాష్ట్రం 7లక్షల కోట అప్పులో ఉందన్నారు. ప్రతీనెల అప్పుతో పాటు మిత్తీ కడుతున్నామని, మిగిలిన డబ్బులు సర్దుబాటు చేసుకుని పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వరంగల్ ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను రెండో రాజధానిగా మార్చి అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన మాటను గుర్తు చేశారు. ప్రభుత్వం ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా వరంగల్ అభివృద్ధి కోసం రూ.6వేల కోట్లను మంజూరు చేశారన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రూ.750కోట్ల నిధులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిల్ ఫెడ్ స్టేట్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీడీవో అనిల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాసరెడ్డి
- పెంబర్తిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

హసన్‌పర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలంలోని పెంబర్తిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం అధికారికంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ గృహ నిర్మాణాల సమాచార శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అతిథులుగా అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలను, పాలనను పూర్తిగా మరిచిపోయి కేవలం వాళ్ల సొంత సంపాదనే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గ్రామాల్లో ఒక రేషన్ కార్డు కావాలా? ఒక ఇల్లు కావాలా? అని ఇప్పుడు కూడా ప్రజల దగ్గరకు వచ్చిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఎన్నికల ముందు తెలంగాణకు వచ్చి ఏవైతే హామీలు ఇచ్చి ఆరు పథకాలు అమలు చేస్తామని చెప్పారో.. వాటిని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నాలుగు పథకాల అమలుకు దిశానిర్దేశం చేశారని చెప్పారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, ఆత్మీయ భరోసా కింద ప్రతీ పేద కుటుంబానికి యేటా రూ.12వేలు, రైతు భరోసా కింద రెండు విడతలుగా రూ.12వేలు, అర్హులైన పేదవాడికి తెల్ల రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు.

ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ. 500లకే గ్యాస్, వరి పండించే రైతులకు మద్దతు ధర రూ. 2320తో పాటు సన్న వడ్లకు బోనస్ రూ.500లు చెల్లిస్తున్న ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదే నన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్‌లో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా 25,600 మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నాలుగు పథకాలకు రూ.45వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిసీ కష్టమైనా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు.

దేశానికి రోల్‌మాడల్

ఇందిరమ్మ రాజ్యమంటేనే దేశానికి రోల్‌మోడల్ అని కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపిస్తూ నాలుగు పథకాలను అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఎంత లోటు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇప్పటికే 56వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలిచామన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. అనర్హులైన వారు సంక్షేమ పథకాలు పొందితే తప్పకుండా ప్రభుత్వం వారి పథకాలను రద్దు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలో పంచాయతీ గ్రామాలతో విలీన గ్రామాలున్నాయని, అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలే అధికంగా ఉన్నారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి అదనంగా 1500 ఇండ్లు కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అభ్యర్థించారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గానికి అదనంగా నిధులు కూడా మంజూరు చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలను, రైతులను కాపాడుకుంటోందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందేవిధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎప్పుడు దరఖాస్తు చేస్తే అప్పుడే ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.



మాట్లాడుతున్న సురేఖ



మాట్లాడుతున్న నాగరాజు

ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రెటరీ రామక్రిష్ణ, స్పెషలాఫీసర్ అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, పంచాయతీ స్పెషలాఫీసర్ నాగవెల్లి శ్రీనివాస్, హౌసింగ్ నోడల్ ఆఫీసర్ రాజేందర్, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఏవో అనురాధ, ఏపీవో విజయలక్ష్మీ, ఏపీఎం ప్రభాకర్, ఏఈవో శైలజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, మధన్, చిర్ర విజయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి ఆలయంలో రథ సేవ

భక్తులకు అన్నప్రసాద వితరణ

వరంగల్ కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం రథ సేవ నిర్వహించారు. అమ్మవారు ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల జై కారాలతో ఆలయంలో రథ సేవను నిర్వహించారు.

అలాగే మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయం వెలుపల భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గణతంత్ర దినోత్సవం ఆదివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి అమ్మవారికి మహా హారతి పూజ నిర్వహించారు.

జనగామలో టెన్షన్.. టెన్షన్

- మంత్రి పొంగులేటి పర్యటన నేపథ్యంలో ఉద్రిక్తత
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- ఆందోళన నేపథ్యంలో మంత్రి పర్యటన రద్దు



ఎమ్మెల్యే పల్లా, పోలీసుల మధ్య వాగ్వాదం

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం ఎర్రకుంటతండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన సందర్భంగా హై టెన్షన్ వాతావరణం ఏర్పడింది. సభా వేదిక వద్దే కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రారంభ కార్యక్రమాన్ని ఎర్రకుంటతండాకు మధ్యాహ్నం 2.30గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం హాజరు కావాల్సి ఉంది. దీని కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఇదే కార్యక్రమంలో ఎమ్మెల్యే హోదాలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా హాజరు అయ్యేందుకు సభా వేదిక వద్దకు వచ్చారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో ముందస్తు అరెస్టులు చేసిన బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాల్సిందిగా కోరారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే పల్లాను చూసి పల్లా.. గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఇరు వర్గాలు కాంగ్రెస్ జిందాబాద్.. పల్లా గోబ్యాక్ అంటూ పోటాపోటీగా నినాదాలు అంతటితో ఆగకుండా సభలో ఉన్న కుర్చీలను విసిరేసుకున్నారు. గమనించిన పోలీసులు లాఠీలను ఝుళిపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన తాళ్లపల్లి అశోక్ చేతికి, గానుగుపహాడ్‌కు చెందిన గుర్రం కుమార్‌కు మోకాలికి గాయమైంది. ఆందోళన జరుగుతుండడంతో ధర్మసాగర్ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి ఎర్రకుంటతండా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇదే విషయాన్ని స్టేజీ మీద అధికారులు ప్రకటించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పల్లా మైక్ తీసుకొని మాట్లాడబోతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారి నినాదాలు చేస్తూ పల్లా పైకి రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. వెంటనే స్పందించిన పోలీసులు ఎమ్మెల్యే పల్లాను దూరంగా తీసుకొచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు విసిరిన రాయి ఓ జర్నలిస్టుకు కంటికి తగిలింది. చికిత్స కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, గొడవ జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రకుంటతండాకు వస్తున్నారని తెలియడంతో ఆందోళన మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావించారు. దీంతో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బలవంతంగా కారు ఎక్కించి జనగామకు తరలించారు. దీంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. అనంతరం హడావుడిగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించి కార్యక్రమాన్ని ముగించారు.

భారీగా మోహరించిన పోలీసులు

మంత్రి పొంగులేటి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు భారీగా బలగాలను మోహరించాయి. జనగామతో పాటు వెస్ట్‌జోన్ పరిధిలోని నర్మెట్ట, రఘునాథపల్లి, జనగామ పోలీస్ స్టేషన్ల నుంచి సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ముందస్తుగా బీఆర్ఎస్, బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేశారు.



పల్లాను బలవంతంగా కారులో ఎక్కిస్తున్న పోలీసులు



లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

నలిగిన వలస బతుకులు

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

➡ కంటైనర్‌లోని స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత ➡ వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన

మామునూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంగాని రాష్ట్రం.. ప్రాంతం కాని ప్రాంతానికి పొట్టచేత పట్టుకుని బతుకుదెరువు కోసం వచ్చిన వారిపై ఓ కంటైనర్ లారీ మృత్యురూపంలో వచ్చిపడింది. కత్తులు, ఈలపీటలు తయారు చేసి విక్రయిస్తూ కడుపు నింపుకునేవారి జీవితాలు ఆ ప్రమాదంలో కడతేరాయి.. కుటుంబసమేతంగా వచ్చి జీవిస్తున్న వారి జీవితాలు ఒక్క నిమిషంలో ఒక్కసారిగా చిన్నాభిన్నమయ్యాయి. మద్యం మత్తులో వేగంగా భారీ కంటైనర్ లారీ నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్.. రెండు ఆటోలను ఢీకొట్టి నలుగురు ప్రాణాలు బలిగొన్నాడు. వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు పోలీసుస్టేషన్ పక్కనున్న పెట్రోల్‌బంకు వద్ద ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మామునూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

మధ్యప్రదేశ్ భోపాల్ లలితానగర్ ప్రాంతానికి చెందిన లోపిట సంతోష్ చౌహాన్(48) అనే వ్యక్తి బతుకు దెరువు కోసం భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులతో సహా వరంగల్ మామునూరు ప్రాంతానికి తొమ్మిది నెలల కిందట వచ్చారు. ఆయన కుటుంబంతో పాటు సుమారు ఆరు కుటుంబాలు కూడా ఇక్కడి వచ్చారు. వంటకు ఉపయోగించే కత్తులు, ఈలపీటలు తయారు చేసి వాటిని అమ్ముతూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో వారు తయారు చేసిన కత్తులు, ఈలపీటలు వరంగల్ నగరంలో విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం కూడా ఒకే ఆటోలో వీరందరూ వరంగల్ వైపు వెళ్తున్నారు. కాగా, కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ రాపర్తి సాగర్ ఐనవోలు నుంచి వరంగల్ వైపు వేరే ఆటోలో వెళ్తున్నాడు. అదే సమయంలో విశాఖపట్టణం నుంచి నాగపూర్ వైపు విశాఖ ఉక్కు భారీ స్తంభాలు కలిగిన అధిక లోడుతో నాగపూర్‌కు చెందిన భారీ కంటైనర్ వాహనం వస్తోంది. మామునూరులోని పోలీస్‌స్టేషన్ పక్కనున్న పోలీసుపెట్రోల్ బంక్ దగ్గరికి రాగానే అధిక లోడుతో వెళ్తున్న 18 టైర్ల కంటైనర్ భారీ వాహనం అదుపుతప్పింది. పక్కనే ఉన్న రెండు ఆటోల మీద లారీలో ఉన్న ఇనుప స్తంభాలు మీద పడ్డాయి. ఈ ఘటనలో సంతోష్ చౌహాన్(48), ఆయన కుమార్తెలు ఆర్తి అలియాస్ పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్(12)లు అక్కడికక్కడే మృతిచెందగా... ఆయన చిన్న కుమారుడు కన్నా చౌహాన్(7) ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కాగా, భార్య చామ బాయి(40), పెద్దకుమారుడు ముఖేష్ చౌహాన్(20)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరి ఆటో నడుపుతున్న పున్నేలు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ షాకీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అలాగే వేరే ఆటోలో ఉన్న కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ రాపర్తి సాగర్ (45) గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని ఎంజీఎంకు తరలించారు.



కంటైనర్ లారీలోని స్తంభాలు మీద పడడంతో ఛిద్రమైన శరీరాలు

ఛిద్రమైన శరీరాలు

ఒకే కుటుంబానికి చెందిన వారిపై భారీ లోహపు స్తంభాలు పడటంతో సంఘటన జరిగిన స్థలంలో శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఇనుప స్తంభాల కింద వలస కూలీలు మృతదేహాలు ఇరుక్కుపోవడంతో అక్కడి స్థానికులు ప్రమాదం జరిగిన తీరును చూసి చలించిపోయారు. బతుకు దెరువుకోసం కులవృత్తిని నమ్ముకుని పలు ప్రాంతాలు తిరుగుతూ జీవనం కొనసాగిస్తున్న వీరి కుటుంబం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఎంజీఎంలో మిన్నంటిన రోదనలు

నలుగురు వలస జీవులు మృత్యువాత పడటంతో ఎంజీఎం ఆస్పత్రిలో వారి సంబంధీకులు చేస్తున్న రోదనలు ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించాయి. ఆస్పత్రికి వైద్యానికి వచ్చిన రోగుల బంధువులు మానవత్వంతో భోజనం అందించే ప్రయత్నం చేయగా.. నోట్లోకి ఏమీ పోవట్లేదని రోదించారు. మా సొంతూరుకి మమ్మల్ని పంపిస్తే వెళ్లిపోతామని రెండు చేతులు జోడించి అమాయకంగా విలపించారు. దీంతో అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ చలించిపోయారు.

సంఘటనా స్థలానికి కలెక్టర్, సీపీ

వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, ప్రమాద ఘటనా స్థలాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మునిసిపల్ కమిషనర్ తానాజీ వాకడే, ఇతర పోలీసు అధికారులు సందర్శించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని అధికారులకు స్థానికులు తెలిపారు. కాగా ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముఖేష్ చౌహాన్ ఫిర్యాదు మేరకు మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ ఓ.రమేష్ తెలిపారు.

మృతదేహాల తరలింపు

మామునూరు రోడ్డు ప్రమాద మృతులకు ఎంజీఎం మార్చురీలో వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆదివారం అయినా అధికారుల ఆదేశాలతో వైద్యులు పోస్టుమార్టం చేశారు. కాగా, సీపీ అంబర్‌కిషోర్ ఝా వాహనాలను సమకూర్చి మృతదేహాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు తరలించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మృతదేహాల తరలింపు జరిగింది.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రధాన రహదారిపై బోల్తా పడ్డ కంటైనర్ లారీ



మృతదేహాలను చాపలో తీసుకెళుతున్న పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి

వరంగల్ మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని తక్షణమే మెరుగైన వైద్యం అందించేందుకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులు ప్రైవేటు హస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

క్షతగాత్రులకు మంత్రి సురేఖ ఆర్థిక సాయం



క్షతగాత్రుల కుటుంబాలను ఓదార్చుతున్న మంత్రి సురేఖ

వరంగల్ క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో వేర్వేరు వార్డుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి సురేఖ పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పూర్తిగా కోలుకునేంతవరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డ్రైవర్ మద్యం తాగి లారీ నడపటం వలనే ప్రమాదం జరిగినట్లుగా అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మంత్రి వెంట వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పంథని వద్దే ఆటోను ఢీకొట్టిన కంటైనర్

ఐనవోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మామునూరు వద్ద ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ.. తొలుత పంథిని వద్ద ఓ ఆటోను ఢీకొట్టి వేగంగా వెళ్లింది. ఆదివారం ఉదయం పంథిని నల్లబండ బ్రిడ్జి వద్ద ఆటోను వెనుకనుంచి ఢీకొనడంతో ఆటో పడిపోయింది. ఈ ప్రమాదంలో కక్కిరాలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ చిర్ర రాజుకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగాక కంటైనర్ నిలపకుండా వరంగల్ వైపు వేగంగా వెళ్లింది. ఆటోడ్రైవర్ వెంబడిస్తాడనే భయంతో డ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా వెళ్లడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. డ్రైవర్ ప్రవర్తనను గమనించిన కొంత మంది 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చేలోపే మామునూరు వద్ద ప్రమాదం జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు వాపోయారు.



ప్రమాదానికి గురైన ఆటో

మిఠాయిలు పంచిన బాలకృష్ణ అభిమానులు

వరంగల్ చౌరస్తా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో, హిందూపురం శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించడంతో అఖిల భారత నందమూరి బాలకృష్ణ యువసేన జాతీయ కన్వీనర్ జీఎల్ శ్రీధర్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. వరంగల్ చౌరస్తాలో బాలకృష్ణ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు. కేంద్ర ప్రభుత్వం బాలకృష్ణ సేవలను గుర్తించి విశిష్ట అవార్డు ప్రకటించడం ఆనందదాయకమని జీఎల్ శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల కుంట రవికుమార్, సిరబోయిన రాజు, మామిండ్ల రాములు, ఎండి మస్తాన్, సుదర్, కుమార్, జిలకర వీరస్వామి, సాయి, అకినెపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తాలో స్వీట్లు పంచుతున్న బాలకృష్ణ అభిమానులు

ఉత్తమ అవార్డులు అందుకున్న ఉద్యోగులు



కలెక్టర్ సత్యశారద నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి



రాజిరెడ్డి సీఈవో



బాలకృష్ణ డీపీవో | కోటేశ్వర్‌రావు సబార్డినేట్ | ప్రేమలత ఏపీఆర్వో | శ్రీకాంత్ ఫొటోగ్రాఫర్



గోపి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ | వేంకటేశ్వర్లు ఎస్సై | రంజిత్ కుమార్ సీఐ | సువర్ణ సీఐ



విశ్వేశ్వర్ సీఐ | యుగేందర్ ఎస్సై | రామరావు ఎస్సై | రాధిక ఎస్సై



అరుణ ఎస్సై | సుధాకర్ ఫొటో గ్రాఫర్ | గుండె కుమార్ రిపోర్టర్ | వేణు గోపాల్ వెటర్నరీ



పీటీసీలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్పీ పూజ



హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఫారెస్టు అధికారి



అవార్డు అందుకుంటున్న డిప్యూటీ జైలర్ వెంకటేశ్వర్లు



ఏనుమాముల మార్కెట్లో జెండా ఆవిష్కరిస్తున్న జేడీ ఉప్పుల శ్రీనివాస్



భద్రకాళి దేవస్థానంలో గీతాలాపన చేస్తున్న ఈవో శేషు భారతి



ఉర్సు గాంధీ విగ్రహం వద్ద జాతీయ పతాకావిష్కరణ చేసిన కాంగ్రెస్ నాయకులు



కాశిబుగ్గ అర్బన్ బ్యాంక్ వద్ద జెండాకు వందనం చేస్తున్న ప్రదీప్ రావు, ఉద్యోగులు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

నగరంలో ఘనంగా గణతంత్ర వేడుకలు ● జెండాలు ఆవిష్కరించిన అధికారులు, నాయకులు

వరంగల్ కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పలు జంక్షన్లలో, అడ్డాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో జాతీయ గీతాలను ఆలపిస్తూ జెండాకు వందనం చేశారు. భద్రకాళి దేవస్థానంలో ఈవో శేషుభారతి జాతీయజెండాను ఎగరవేసి వందనం సమర్పించారు.

29వ డివిజన్ రామన్నపేటలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణచందర్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగరవేశారు. ఆంధ్ర బాలిక కళాశాలలో, రాజీవ్‌గాంధీ విగ్రహం సెంటర్, రామన్నపేటలోని శ్రీసీతారామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పాటు మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలో, అమ్మఒడి భవన్‌లో జాతీయ జెండా ఎగరవేశారు. వరంగల్ చౌరస్తా ఆటో స్టాండ్, పాత బీట్‌బజార్, బట్టల బజార్, రామన్నపేట రామ థియేటర్ వీధిలో జాతీయ జెండాలను ఎగురవేశారు.

● వరంగల్ కార్పొరేషన్: బల్దియా కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాఖడే జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా బల్దియా అధికారులు, కార్పొరేటర్లకు నిర్వహించిన క్రీడలలో విజేతలుగా నిలిచిన అధికారులకు, కార్పొరేటర్లకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేర్ రిజ్వానా మసూద్ షమీమ్, కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, గుండు చందన, రమ తేజస్విని, అరుణ కుమారి, బస్వరాజు శిరీష, ఇమ్మడి లోహిత, మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, నల్ల స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ వ్యవసాయం: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, మార్కెటింగ్‌శాఖ జయింట్ డైరెక్టర్, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్ మూడు రంగుల జెండాను ఆవిష్కరించారు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు.

● కరీమాబాద్: ఉర్సు కుమ్మరివాడలో కాంగ్రెస్ నాయకుడు యుగేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో, ఉర్సు ప్రతాప్‌నగర్‌లో, కుమ్మరివాడ, సతీష్ విగ్రహంవద్ద, స్థానికులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మిల్స్‌కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● కాశిబుగ్గ: కాశిబుగ్గలోని అర్బన్‌కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు జెండా ఎగురవేశారు. కాశిబుగ్గ, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● మిల్స్‌కాలనీ: ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ జెండాను ఆవిష్కరించారు. చింతల్‌లో డిప్యూటీ మేయర్ సయ్యద్ రిజ్వాన మసూద్ జెండాను ఆవిష్కరించారు. ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐ కొత్త రాజు, జ్యోతిబసు కాలనీలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ జెండాను ఆవిష్కరించారు.

● మట్టెవాడ: వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపిరెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, సాంబయ్య, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులో మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం వైశ్య భవన్‌లో పొట్టి శ్రీరాములు, గాంధీజీ, వాసవి మాత విగ్రహాలను ఆవిష్కరించారు. 28వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గందె కల్పననీన్ జాతీయ జెండాను ఎగురవేశారు. మట్టెవాడలో బీఆర్ఎస్ నాయకులు దాస్యపల్లి సీతారాం జాతీయ జెండాను ఎగురవేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జాతీయ జెండాను ఎగురవేశారు.

● పోచమ్మమైదాన్: ఫైడిపెల్లిలో స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ జాతీయ జెండా ఏగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఆరెపల్లి, కొత్తపేట విలీన గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్ తదితరులు జెండా ఆవిష్కరించారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ భూక్య సైదులునాయక్ జాతీయ జెండా ఆవిష్కరించారు. 13వ డివిజన్ ఎల్‌బీనగర్, దేశాయిపేట ప్రాంతాలలో కార్పొరేటర్ సురేష్‌జోషి జెండా ఆవిష్కరించారు. 22వ డివిజన్‌లో కార్పొరేటర్ బస్వరాజుకుమారస్వామి పలు చోట్ల జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఫైడిపెల్లి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కన్నెబోయిన సారయ్య, కసివోజ్జల రమణాచారి, ముంజ కుమారస్వామి, ఉప్పుల నరేంద్రబాబు, కూనమళ్ల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ టౌన్: గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి-సత్యనారాయణ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం డివిజన్ ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొగిళి, శ్రీను, వినయ్, హరికృష్ణ, దామోదర్, తిరుపతి పాల్గొన్నారు.

వరంగల్ కొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్‌లో అలయెన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు హజరై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం స్థానికులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు దోమల నాగేందర్, మంత్రి లింగమూర్తి, గజ్జెల ఓంకార లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కాశిబుగ్గలో ఇందిరా విగ్రహం వద్ద ఎమ్మెల్సీ సారయ్య, కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ తదితరులు



బీజేపీ జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న గంటా రవికుమార్



చింతల్‌లో జెండా వందనం చేస్తున్న డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్ తదితరులు



పిన్నవారి విధిలో జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ గందె కల్పన తదితరులు



ఆర్ఎన్‌టీ రోడ్డులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు



పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



పోచమ్మమైదాన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సబ్‌రిజిస్టర్ భూక్య సైదులునాయక్



23వ డివిజన్‌లోజాతీయ జెండాకు వందనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోరాటమే స్ఫూర్తి కావాలి

(5వ పేజీ తరువాయి)

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.4,170 కోట్లు కేటాయించిందని, అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని అన్నారు. శాంతిభద్రతలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా చర్యలు తీసుకుంటోందని అన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్..

ఖుష్‌మహల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. డీఆర్‌డీఏ, ఆర్టీఏ, చేనేత వస్త్ర పరిశ్రమ, సఖీ కేంద్రం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, వైద్యఆరోగ్య శాఖ, ఉద్యాన వన మరియు పట్టు పరిశ్రమల శాఖ, వ్యవసాయశాఖ, మెప్మా, వరంగల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తమ సేవలను, ఉత్పత్తులను ప్రదర్శించారు.

ఉత్తమ తహసీల్దార్‌గా మహ్మద్ ఇక్బాల్

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డు అందజేసిన కలెక్టర్



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న మహ్మద్ ఇక్బాల్

పోచమ్మమైదాన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ ఉత్తమ అధికారిగా ప్రశాంసాపత్రాన్ని అందుకున్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ ఐఎంఏ హాల్‌లో ఆదివారం ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటరు నమోదులో గత ఎన్నికలలో విశేషంగా కృషి చేసిన ఉద్యోగులను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేశారు. అందులో భాగంగా వరంగల్ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా (ఏఈఆర్‌వో) వ్యవహరిస్తున్న మహ్మద్ ఇక్బాల్‌కు ఉత్తమ ఏఈఆర్‌వోగా జిల్లా కలెక్టర్ సత్యశారద ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆయనతో పాటు ఓటరు నమోదులో గత ఎన్నికలలో విశేషంగా కృషి చేసిన మరో ముగ్గురు సిబ్బందికి అవార్డులు వచ్చాయి. జూనియర్ అసిస్టెంట్‌లు గద్దల రాజు, గూడెం శ్రీనివాస్, మహేందర్ కలెక్టర్ సత్యశారద చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు స్వీకరించారు.

పాటల సీడీని ఆవిష్కరించిన కలెక్టర్

వరంగల్ వ్యవసాయం, జనవరి26 (ఆంధ్రజ్యోతి): వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో తెలంగాణ సమాచారశాఖ, సంస్కృతిక కళాకారులు మిర్చి పంట సాగు పద్దతులపై రూపొందించిన పాటల సీడీని గణతంత్ర వేడకల్లో కలెక్టర్ సత్యశారద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కీలకం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన మంత్రి సురేఖ

వరంగల్‌సిటీ, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య భారతదేశంలో రాజ్యాంగానిది ప్రధాన భూమిక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం ఓసిటీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం రోజున రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం..

కరీమాబాద్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారం కరీమాబాద్ రామస్వామి గుడి క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆమె బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తోందని, క్రీడా ప్రాంగణాలు, స్టేడియంలను అభివృద్ధి చేస్తోందని అన్నారు. ఇప్పటికే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లును ఆమోదించుకున్నట్లు మంత్రి గుర్తు చేశారు. ఈ క్రికెట్ టోర్నమెంటులో కరీంనగర్ జిల్లా జమ్మికుంట జట్టుకు మొదటి బహుమతి కింద రూ.70వేలు, ట్రోఫీ అందించారు. ద్వితీయ బహుమతి కింద మహబూబాబాద్ జిల్లా జట్టుకు రూ.30వేలు, మూడో బహుమతిగా వరంగల్ జిల్లా జట్టుకు రూ.15వేలు, నాలుగో బహుమతిగా హన్మకొండ జిల్లా జట్టుకు రూ.10వేలు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న జమ్మికుంట జట్టు

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

మట్టెవాడ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు ప్రారంభించిన సందర్భంగా ఆదివారం వరంగల్‌లో పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో బాణాసంచా కాల్చి, సీట్లు పంచారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరవి పరమేశ్, కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, బస్వరాజ్ శ్రీరిష శ్రీమాన్, మాజీ కార్పొరేటర్లు తత్తెర లక్ష్మణ్, దూపం సంపత్, దామెర సర్వేశం, బిల్లా కవిత శ్రీకాంత్, జన్ను రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంటల రాజు, కాంగ్రెస్ నాయకులు కరాటే ప్రభాకర్, బస్వరాజ్ శ్రీమాన్, ఎమ్డీ తహేర్, ఎమ్డీ జహీర్, బస్వరాజ్ కుమార్, ఎమ్డీ మస్తాన్, శాగంటి శ్రీనివాస్, రామ యాదగిరి, కోదాటి అనిల్, పెద్ద సంఖ్యలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

మామునూరులో స్తంభించిన ట్రాఫిక్

రెండు గంటల పాటు శ్రమించి క్లియర్ చేసిన పోలీసులు



యంత్రాలతో స్తంభాలను తొలగిస్తున్న పోలీసులు

మామునూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద ఘటనతో మామునూరులో ట్రాఫిక్ స్తంభించింది. ఇనుప స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మామునూరు ఏసీపీ డి.తిరుపతి పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. డీఆర్ఎఫ్ బృందాలు రెండు గంటల పాటు శ్రమించి భారీ క్రేన్లతో కంటైనర్ వాహనాన్ని తొలగించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు సరైన నిద్రలేకపోవడం ఒక కారణమైతే.. మద్యం సేవించి ఉండడం మరో కారణమని పోలీసులు భావిస్తున్నారు.

మృతదేహాలను గుర్తించడానికి పోలీసుల పాట్లు..

మృతులు ఎవరేనది తెలుసుకోవడానికి పోలీసులు నానా హైరానా పడ్డారు. వారి బంధువులు ఒక్కొక్కసారి ఒక్కొక్కరి పేరు చెబుతుండటంతో పోలీసులు అయోమయానికి గురయ్యారు. మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో డివిజన్‌లోని ముగ్గురు సీఐలు రాజ్‌గోపాల్, రాఘవేందర్, ఓ.రమేష్ మార్చురీకి వచ్చి పూర్తి వివరాలను సేకరించారు.

మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

కాశిబుగ్గ, జనవరి26(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ పురస్కారం లభించిన సందర్భంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్, జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ దీప్, విజయ్ మాట్లాడుతూ.. 30ఏళ్లుగా మంద కృష్ణ చేసిన ఉద్యమాలను వివరించారు. ఆయన కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు కోట రాజు, మల్లన్న, సుధాకర్, రాజు, దేవిప్రసాద్, ప్రవీణ్, అరుణ్ మిత్ర, మహేష్, కరుణాకర్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

కరీమాబాద్, జనవరి26,(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను అందజేశారు. వరంగల్ చార్‌బౌలి ప్రాంతానికి చెందిన వృద్ధురాలు దేవునూరి సోమమ్మకు రెండు నెలలకు సరిపడా సరుకులను అందజేశామని సమితి వ్యవస్థాపకుడు తాళ్లపెల్లి నగేష్ తెలిపారు. సేవా సమితి సభ్యులు అందిస్తున్న విరాళలతో అభాగ్యులకు తమ వంతుగా సాయం అందిస్తున్నామని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తమకు సహాయ సహకారాలు అందిస్తున్న సనాతన హిందూ సేవాసమితి సోషల్ మీడియా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు తాళ్లపెల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, ఉపాధ్యక్షుడు అనుమాండ్ల రాజేందర్, ముఖ్య సలహాదారుడు అంచూరి వేణుగోపాల్, గ్రూప్ సభ్యులు పోతరాజు, సామంత్ తదితరులు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్ కోటలో జరిగిన గణతంత్ర వేడుకలో జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద



పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

పోరాటమే స్ఫూర్తి కావాలి



- త్యాగధనులను స్మరించుకోవాలి
- నాలుగు పథకాలతో ప్రజల్లో వెలుగులు
- అభివృద్ధి పథంలో వరంగల్ జిల్లా
- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- ఖిలా వరంగల్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వరంగల్ సిటీ, జనవరి26 (ఆంధ్రజ్యోతి): ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని, త్యాగాలను స్మరించుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగాన్ని రచించుకుని, 26 జనవరి 1950 నుంచి అమలులోకి తెచ్చుకున్నామని, అప్పటినుంచి దేశ ప్రజలందరూ స్వేచ్ఛ, సమానత్వంతో జీవిస్తున్నారని అన్నారు. ఆదివారం ఖిలా వరంగల్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ ఈ నాలుగు నూతన పథకాలను పజలకు అందించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు నేస్తం, వరి పంటకు బోనస్, ఆయిల్ పామ్ పంట విస్తరణకు ప్రోత్సాహకాల వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయాలనే ఉద్దేశంతో సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500లు బోనస్ ఇస్తోందన్నారు. వరంగల్ జిల్లాలో 10వేల 956 మంది రైతుల నుంచి సన్నరకం ధాన్యాన్ని సేకరించామని వివరించారు. 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పని చేసిన భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ భరోసా కింద యేడాదికి రూ.12 వేలు అందేందుకు చర్యలు తీసుకుంటోందని అన్నారు. అదేవిధంగా సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇస్తోందని అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3500ల చొప్పున ఇండ్లను మంజూరు చేసిందన్నారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు మరమ్మతు చేసి భూమిలేని నిరుపేదలకు కేటాయిస్తామన్నారు.

వరంగల్ జిల్లాలో 2 లక్షల 66 వేల 661 కుటుంబాలకు ప్రతీ నెల 49వేల 782 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని, జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,32,763 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 28 వేల మంది రైతులకు రూ.308 కోట్లు చెల్లించామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు 200 లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఐదు లక్షలు ఉన్న ఆరోగ్య శ్రీ కవరేజీని రూ.10 లక్షలకు పెంచామని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా ఉన్నతీకరించామని, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో 72 వేల ఎకరాలకు సాగునీరందించామని, జిల్లాలో రూ.14 కోట్ల 85 లక్షలతో చెక్ డ్యాములు నిర్మించామని అన్నారు. గురుకుల విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం డైట్‌కు, 200శాతం కాస్మెటిక్ చార్జీలను పెంచామన్నారు. రైతాంగ భూసమస్యల నివారణకు ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టం తెచ్చిందని, ఈ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 54వేల సమస్యలను త్వరతలోనే పరిష్కరిస్తుందని అన్నారు. మత్సశాఖ ద్వారా ఈ సంవత్సరం 7 వేల 762 టన్నుల చేపలు, 235 టన్నుల రొయ్యలు ఉత్పత్తి చేశామని, 100శాతం సబ్సిడీతో రిజర్వాయర్లు, మీడియం మైనర్ ఇరిగేషన్ చెరువులలో 95 లక్షల 91 వేల చేప పిల్లలను సబ్సిడీపై సరఫరా చేశామని అన్నారు. వరంగల్ మహా నగరపాలక సంస్థలో రూ.43 కోట్లతో 176 అభివృద్ధి పనులు చేపట్టామని, స్మార్ట్ సిటీ కింద రూ.499 కోట్లతో 66 అభివృద్ధి పనులు మంజూరయ్యాయని అన్నారు. వరంగల్ బస్ స్టేషన్‌ను రూ.75 కోట్లతో అత్యంత ఆధునికంగా ఐదు అంతస్తులతో నిర్మిస్తున్నామని అన్నారు.



అన్నదాతలపై రాసిన గీతాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ ప్రాంతంలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మొదటగా వెంపటి శ్రావణి ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు శ్రీ విష్ణురా జే బజే అంటూ నర్తించి ఆకట్టుకున్నారు. గీసుగొండ మండలంలోని ఏవీవీ లిటిల్ జెమ్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బోనాలు, బతుకమ్మ, జాతీయ జెండాలతో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నృత్యాన్ని ప్రదర్శించారు. నెక్కొండకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. చెన్నారావుపేట మండలం జల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు రాయపర్తి కేజీబీవీ విద్యార్థులు దేశభక్తి గీతాలతో అలరించారు. అనంతరం వరంగల్ వ్యవసాయమార్కెట్ చైర్మన్ బి.రవీందర్‌రెడ్డి అన్నదాతలపై రూపొందించిన పాటల సీడీని కలెక్టర్ సత్యశారద ఆవిష్కరించారు.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

వరంగల్ జిల్లాలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులను ప్రభుత్వం వేగవంతం చేసిందని, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్రీన్‌జోన్ ఏర్పాటు చేస్తోందని, రోడ్ల కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల కోసం రూ.179 కోట్లు కేటాయించిందని అన్నారు. పార్క్ కింద భూములు కోల్పోయిన 863మంది రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు.

మామునూరు విమానాశ్రయం

త్వరలోనే మామునూరు విమానాశ్రయం ఏర్పాటు అవుతుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రూ.205 కోట్లు విడుదల చేసిందని అన్నారు. వరంగల్ నగరంలో

మిగతా 6వ పేజీలో...

పాత సెల్‌ఫోన్‌ల కొనుగోలు పేరిట సైబర్ మోసాలు

- గ్రామాల్లో, కాలనీల్లో సంచరిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు



ముఠా సభ్యులు సేకరించిన పాత సెల్‌ఫోన్‌లు

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు గ్రామాల్లో, పట్టణాల్లో పాత ఇనుప సామాను, కాలం చెల్లిన నూకలు, చింతపండు కొంటుండడం చూశాం... కానీ కొత్తగా పాత సెల్‌ఫోన్లు కొంటామంటూ గ్రామాలు, నగరాల్లో బిహార్ ముఠా సభ్యులు సంచరిస్తూ నయా మోసానికి తెరలేపారు. వినియోగం లేని సెల్‌ఫోన్‌ను రూ.100 నుంచి 1000లోపే కొనుగోలు చేసి సెల్‌ఫోన్ యాజమాని, వారి కాంటాక్ట్ లిస్టులో ఉన్న వ్యక్తుల నుంచి లక్షల్లో డబ్బులను కొల్లగొడుతున్నట్లుగా తెలుస్తోంది. ఐదు నెలల కిందట రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని పవర్ హౌస్‌లో పాత్ సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేసే ముఠా పట్టుబడగా ఆసక్తికరమైన విషయాలు రాబట్టారు. తెలంగాణలో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్‌లను కొన్ని భాగాలు మార్చి జామ్‌తారా, దేవ్‌ఘర్, జార్ఖండ్‌కు తరలించి అక్కడ సైబర్‌క్రైమ్‌కు పాల్పడే నేరగాళ్లకు విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసు విచారణలో తేలింది. సైబర్ నేరగాళ్లు వారి సిమ్‌లను ఉపయోగించి పాత సెల్‌ఫోన్ యాజమాని ఖాతాను లూటీ చేస్తున్నట్లుగా పోలీసులకు దృష్టికి వచ్చింది. కాగా, అదే తరహాలో బిహార్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ పోలీసు డివిజన్‌లో గదిని అద్దెకు తీసుకొని గ్రామాలు, కాలనీల్లో వేలాదిగా పాత సెల్‌ఫోన్‌లు సేకరించి సైబర్ నేరగాళ్లకు అప్పగించే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయం కమిషనరేట్ పరిధిలోని ఓ ప్రత్యేక విభాగం దృష్టికి వచ్చినప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఇందిరమ్మ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం



- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డు
- వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా
- భూమిలేని ప్రతీ పేద కుటుంబానికి ఆత్మీయ రైతు భరోసా
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పెంబర్తిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

5



రైతు భరోసా పత్రంతో వృద్ధురాలు | పెంబర్తి గ్రామంలో మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి



మల్లన్న సన్నిధిలో బోనాలు, పట్నాలు

ఐనవోలు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో భాగంగా రెండో ఆదివారం భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్థుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. రథం(శావ)లో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ భక్తులు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్‌ను తలపించేలా రేవంత్‌రెడ్డి పాలన

- పేద ప్రజల కోసమే ముఖ్యమంత్రి ఆలోచన
- పదేళ్లలో చేయలేని పనులు ఏడాదిలో చేస్తున్నాం..
- బీఆర్ఎస్ నేతల ఆరోపణలు అర్ధరహితం

4

- గ్రామాల్లో కూర్చొని, అధికారులను పంపించి పథకాలు ఇస్తున్నాం..
- రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వెంకట్రావుపల్లి (బొక్కలగూడెం) గ్రామంలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

నలిగిన వలస బతుకులు

కంటైనర్ స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత



మామునూరు వద్ద అదుపుతప్పిన కంటైనర్ లారీ, స్తంభాలు పడడంతో నుజ్జు నుజ్జు అయిన ఆటో



మృతులు ఆర్తి చౌహాన్, కన్నా చౌహాన్, సంతోష్ చౌహాన్, కిరణ్ చౌహాన్

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఘోర ప్రమాదం
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

5

వలస జీవులను మృత్యువు కంటైనర్ లారీ రూపంలో కబళించింది. పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చిన వారిపై విధి పగబట్టినట్లు అయింది. బతుకుదెరువు కోసం తాము తయారు చేసిన కత్తులు, ఈలపీటలు అమ్ముకునేందుకు ఆటోలో వెళుతున్న నిరుపేద కుటుంబంపై కంటైనర్‌లోని ఇనుప స్థంభాలు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. స్తంభాల బరువుకు దేహాలు చితికిపోయాయి. ఈ ఘటనలో అదే కుటుంబంలో ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర ప్రమాదం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది.

- మామునూరు(ఆంధ్రజ్యోతి)

ప్రపంచానికి వెలుగు అంబేద్కర్



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజలందరికీ వెలుగు నింపిన ఘనత భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కే దక్కిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారక్కపేట గ్రామంలో జాతీయ రహదారికి పక్కనే ఏర్పాటు చేసిన నూతన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. సమాజంలో కుల, మత, వర్గ, లింగ బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛయూత సమానత్వ భావాన్ని రాజ్యాంగం ద్వారా కలుగజేసిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అన్నారు. అలాగే రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలియజేశారు. అంబేద్కర్ సమాజానికి ఆదర్శప్రాయుడన్నారు. నేటి యువత అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో నాయకులు పెద్ది స్వప్న, బడే నాగజ్యోతి, బానోతు సారంగపాణి, చెట్టుపల్లి మురళి, ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్, వక్కల చంద్రమౌళి, భట్టు సాంబయ్య, బొట్ల నరేష్, చెన్నమల్ల చైతన్య, అడ్డ రాజు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



నర్సంపేట క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



వర్ధన్నపేట క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

నర్సంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవాన్ని మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ఉమారాణి, కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్, మునిసిపాలిటీలో కమిసనర్ జోనా జాతీయ పతాకాన్నిఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, కౌన్సిలర్లు, మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఉత్తమసేవలు అందించిన కార్మికులకు ప్రశంసాపత్రాలను అందించారు. ఆర్టీసీ డిపోలో డీఎం ప్రసూనలక్ష్మి, వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కార్యదర్శి రెడ్యానాయక్, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగులరాణాప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మండల బీఆర్ఎస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, అంబేద్కర్‌నగర్ కాలనీలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయదీప్, సీపీఐ కాలనీలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు పంజాల రమేశ్, ప్రభుత్వ, గురుకుల, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● వర్ధన్నపేట(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ అంబటి నర్సయ్య, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయసాగర్, మున్సిపాలిటీలో కమిషనర్ ఇమ్మడి సుధీర్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయంలో వెంకటరమణ, ఫైర్ కార్యాలయంలో ఫైర్ అధికారి, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ ఫ్లోరెన్స్ జెండావిష్కరణ చేశారు. వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంమూర్తి జాతీయ పతాకావిష్కరణ చేస్తుండగా జెండాకు కట్టిన ముడి విచ్చుకోకపోవడంతో కిందికిదించి తిరిగి మళ్లీ ఎగురవేశారు.

● వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మన్నపేట జీపీ ఎదుట గ్రామస్పెషల్ ఆఫీసర్ అంకం ధనలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.



బుధరావుపేటలో దేశభక్తుల వేషధారణలో చిన్నారులు

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ కార్యాలయాలు, పార్టీ ఆఫీసులు, పాఠశాలలు, యూత్ క్లబ్‌లు, జీపీలలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, వ్యవసాయ కార్యాలయం ఎదుట ఏవో మాధవి, పోలీసు స్టేషన్ ఎదుట సీఐ సాయి రమణ, ఎమ్మార్సీలో ఎంఈవో వెంకటేశ్వర్లు, గిర్నిబావి సబ్‌స్టేషన్ ఎదుట ఏఈ ప్రత్యూష, గిర్నిబావి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొకల శ్రీనివాస్‌రెడ్డి, ఎంజేపీ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఓదేల మల్లయ్య, దుగ్గొండి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామస్వామి, పీహెచ్‌సీలో డాక్టర్ కిరణ్‌రాజ్, గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు జాతీయ జెండాలు ఎగురవేశారు.

● నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై గోవర్ధన్, ఎంపీ డీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో నరసింహమూర్తి జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీవాణి, పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ఎస్సై రాజేష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సరోజ, కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్య, చెన్నారావుపేట సొసైటీ కార్యాలయంలో వైస్ చైర్మన్ చింతకింది వంశీ, అమీనాబాద్‌లో సొసైటీలో చైర్మన్ మురహరి రవి, ఐకేజీ కార్యాలయంలో ఏపీఎం ఈశ్వర్, విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ జోగానంద్, మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి, జీపీ కార్యాలయాల్లో గ్రామాల ప్రత్యేకాధికారు లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సెంటర్‌ల్లో అంగన్‌వాడీ టీచర్లు జాతీయ జెండాలను ఎగురవేశారు.

● ఖానాపురం (ఆంధ్రజ్యోతి): జీపీ కార్యాలయాల్లో ప్రత్యేకాధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్, తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సునీల్ కుమార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రఘుపతి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● గీసుగొండ (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రియాజుద్దిన్, పోలీస్ స్టేషన్‌లో సీఐ మహేందర్, ఐకేపీలో ఏపీఎం సురేష్, పీఏసీఎస్‌లో చైర్మన్ రడం శ్రీధర్, మొగిలిచర్ల పీఏసీఎస్‌లో చైర్మన్ దొంగల రమేష్, ఎలుకుర్తి పీఏసీఎస్‌లో మోహన్‌రెడ్డి, వంచనగిరి పీఏసీఎస్‌లో కొల్లూరు రవీందర్, ఆయా గ్రామాల్లో కార్యదర్శులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.ధర్మారం జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్‌లో హెచ్‌ఎం సాంబయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అశోక్‌రావు, వంచనగిరి మోడల్‌స్కూల్లో ప్రిన్సిపాల్ సునీత, ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు గంటా రవికుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, సొసైటీ కార్యాలయంల ఎదుట చైర్మన్ మారం రాము, గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సదానందం, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేందర్, ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏఈవో రత్నమాల, వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో నాగరాజులు ఆటో యూనియన్ నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు,

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయంలో కిషన్ నాయక్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రావణ్ కుమార్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● పర్వతగిరి (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటస్వామి, మండల పరిషత్‌లో ఎంపీడీవో శంకర్‌నాయక్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజగోపాల్, కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, బీఆర్ఎస్ కార్యాలయంలో కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్, ఆర్‌ఎంపీల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ జాతీయ జండాలను ఆవిష్కరించారు. సోమారం గ్రామంలో ఆర్‌వీఆర్ గ్రూప్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు స్కూల్ పిల్లలకు బ్యాగ్స్, షూస్, షీల్డ్‌లను అందించారు.

● సంగెం (ఆంధ్రజ్యోతి):ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేష్, ఏవో యాకయ్య, పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, పశువైద్యశాలలో డాక్టర్ రాజు, విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో రాము, గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

ఉద్యోగాలు రావడంతో సంబరాలు

వర్ధన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని భవానికుంటతండా 4వ డివిజన్‌కు చెందిన ముగ్గురు యువకులు పోటీపరీక్షల్లో విజయం సాధించి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జాటోత్ దేవేందర్ నర్సంపేట ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా, జె.రవీందర్ 4వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా, నునావత్ వెంకన్న ఏఆర్ కానిస్టేబుల్‌లకు ఉద్యోగాలు వచ్చాయి. కానిస్టేబుల్‌గా ఎంపికైన రవీందర్ సన్మాన కార్యక్రమానికి రాకపోవడంతో దేవేందర్, వెంకన్నలను ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం రాజయ్య, గ్రామపెద్దలు వసంత్‌నాయక్, రామయ్య, రవినాయక్ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు చల్లాను విమర్శించే స్థాయిలేదు

గీసుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ మొరం దందా, భూదందా, చిల్లర పంచాయితీలతో సెటిల్‌మెంట్‌లు చేస్తూ పబ్బం గడుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డిని విమర్శించే స్థాయి లేదని మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాష్‌లు తీవ్ర ఆరో పణలు చేశారు. ఆదివారం కొనాయి మాకుల పీడీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఉండి చల్లా దిష్టిబొమ్మను దహనం చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పోటీపడి పని చేస్తే ప్రజలతోపాటు తాము కూడా హర్షిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలో ఒక్క అభివృద్ధిపని జరుగలేదన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అన్నారు. తమ నాయకుడు చల్లా ధర్మారెడ్డి ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, అది కండ్ల ముందు కనబడుతుందని వివరించారు. సొంత పార్టీలో గ్రూప్‌లను అరికట్టలేని ఎమ్మెల్యే చిల్లర నాయకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. విచక్షణ లేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడితే గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి చల్లా వేణుగోపా ల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పుండ్రు జయపాల్‌రెడ్డి, జక్కు మురళి, కేదారి, నాగేశ్వర్‌రావు, నాయకులు కంబాల కోటి, గుర్రం రఘు, ముంత రాజయ్య, కొల్పుల కట్టయ్య, రఘుపతిరెడ్డి, జనార్దన్, సంతోష్, ధనుంజయ్, యూత్ నాయకులు శ్రీకాంత్, లెనిన్, ప్రమోద్,అభిషేక్, మున్నాహజార్, రాజు, సారంగం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు సంక్షేమ ఫలాలు







రామతీర్థంలో లబ్ధిదారులకు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ బలరాంనాయక్, కొనాయిమాకులలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందిస్తున్న సారయ్య, బొల్లికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవ రెడ్డి

నల్లబెల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని రామతీర్థం గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాలైన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు అర్హులైన ప్రజలకు అర్హత పత్రాలను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమగ్రమైన సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. దేశంలో ఇందిరమ్మ పాలనను, రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనను ప్రజలు ఇప్పటికి గుర్తు చేసుకుంటున్నారంటే పేద ప్రజలకు సంపూర్ణ సంక్షేమ పథకాలను అందజేశారనేనని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీవో నరసింహమూర్తి, నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, మాలోతు చరణ్‌సింగ్, తేజావత్ సమ్మయ్యనాయక్, చిట్యాల ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించే బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య అన్నారు. కొనాయిమాకుల రైతు వేదికలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన ఆదివారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో కొనాయిమాకులను పైలట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. కొత్త రేషన్ కార్డులు 108, ఇందిరమ్మ ఇండ్లు 61, రైతు భరోసా 710ఎకరాలకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 26 మందికి వచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నిటిని క్రమానుసారంగా అమలు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి సురేష్, ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ రియాజుద్దిన్, ఏవో హరిప్రసాద్ బాబు, ఏఈవోలు, రజిని, కావ్య, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి): అర్హులైనా వారందరికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బొల్లికొండలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలకు సంబంధించిన అర్హుల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. జాబితాలో పేర్లు రాని వారు తమ దరఖాస్తులను అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజుకుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా పక్షపాతం, వివక్ష లేకుండా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అదే ఇందిరాగాంధీ ధ్యేయమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు.ఆదివారం రాగంపేట గ్రామంలో సంక్షేమ పథకాలను ప్రారంభించి లబ్ధిదారులను అనుమతి పత్రాలను ఎమ్మెల్యే పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు అమలు కాలేదన్నారు. వచ్చే ఉగాది నాటికి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. కాగా రాగంపేట గ్రామంలో 111 మందికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అనుమతి పత్రాలు, 112 మందికి రేషన్‌కార్డులు, 25మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 324మంది రైతులకు రూ.34,96,805విలువైన రైతు భరోసా అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పెండెం రామానంద్, ఆర్డీవో ఉమారాణి, మండల ప్రత్యేకాధికారి సౌజన్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో సునీల్‌కుమార్, వేములపల్లి వెంకటప్రసాదరావు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి):నిరుపేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అమీనాబాద్‌లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 134మందికి ఇందిరమ్మ గృహాలు, 80మంది రేషన్ కార్డులు, 8మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మంజూరయ్యాయన్నారు. గ్రామంలో 30ఎకరాల స్థలంలో రూ.300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఉమారాణి, మండల స్పెషల్ అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ ఫణీందర్, మాజీ ఎంపీపీ వీరారెడ్డి, మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సిద్దైన రమేష్, తప్పెట రమేష్, మంద యాకయ్యగౌడ్, బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసేదే కాంగ్రెస్ ప్రభుత్వమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మహబూబనగర్‌లో ప్రజాపాలన పథకాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలోని సంక్షేమ పథకాలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మిగతా అన్ని గ్రామాల్లో మార్చి 31 కల్లా పథకాల పంపిణీ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్ నాయక్, ఏవో వీరభద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, కల్యాణ్ పాల్గొన్నారు.



మహబూబనగర్‌లో లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

● నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పర్శనాయక్ తండాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల అమలు ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. పేరు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలుచేయడం జరుగుతుందని మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రేకంపల్లిలో సంక్షేమ పథకాలను ప్రారంభించి, లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మి, ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఎంపీవో శ్రీధర్, ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.

● పర్వతగిరి (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల మంజూరు పత్రాలను డీపీవో కల్పనతో కలిసి జమాల్‌పురంలో లబ్ధిదారులకు అందించారు. పథకాలు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి మంజూరుచేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏవో ప్రశాంత్, ఏపీవో సుశీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి పంటల సాగుపై పాటల సీడీ ఆవిష్కరణ



జిల్లా కేంద్రంలో సీడీ ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్ సత్యశారద

దుగ్గొండి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన తెలంగాణ సంస్కృతిక సారధి నెల్లుట్ల సుమన్ రచించిన మిర్చి పంట సాగు వివరాలు, అన్నదాతకు అభయం ఏనుమాముల మార్కెట్ రైతుల నేస్తం అనే పాటల సీడీని ఆదివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సత్యశారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సారధి పాటల రచయిత సుమన్ మాట్లాడుతూ మిర్చి పంట తేజ రకానికి మార్కెట్లో డిమాండ్ ఉండడంతో పంట రక్షణ చర్యలు, తెగుళ్ళు, వాటి నివారణ, పండించిన పంటను రైతులు కాపాడుకొనే విధానం తదితర అంశాలు సీడీ రూపంలో పాటలు చేశామన్నారు. సీడీ ఆవిష్కరణలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, మార్కెట్ చాంబర్ ఆఫ్ ప్రెసిడెంట్ బొమ్మినేని రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో ...

గీసుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ ఆదర్శ గ్రామ మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి పాల్గొన్నారు. ప్రసారభారతీ ఆహ్వానం మేరకు గణతంత్ర వేడుకలకు వెళ్లినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కేంద్రప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవితో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో గంగదేవిపల్లి ప్రాముఖ్యత, మన్‌కీబాత్‌లో ప్రధానీ మోదీ మూడు సార్లు గంగదేవిపల్లి గ్రామ ఆదర్శాలు, డాక్యుమెంటరీ గురించి చెప్పి అభినందించిన విషయాలను తెలిపారు.

● నెక్కొండ (ఆంధ్రజ్యోతి): మండల మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. గణతంత్రదినోత్సవ వేడుకలకు ఢిల్లీ హోంశాఖ నుంచి ఆహ్వానం రావటంతో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



శివ (ఫైల్)

గీసుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాయంపేట హవేలిలో వేలు శివ (6)అనే బాలుడు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందిన విషాద ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి గ్రామానికి చెందిన వేలు శుభశ్రీ భర్త చనిపోగా శాయంపేటలోని తల్లిగారి ఇంట్లో ఉంటుంది. కాగా, ఆదివారం కుమారుడికి ఆటవస్తువులు ఇచ్చి స్నానం చేయడానికి బాత్‌రూంకు వెళ్లింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న నీటిసంపు వద్దకు వెళ్లిన బాలుడు ప్రమాదావశాత్తు సంపులో పడ్డాడు. బాత్‌రూం నుంచి బయటికి వచ్చిన తల్లి బాలుడి కనబడకపోవటంతో ఆందోళనతో బయటి వెతికింది. ఎక్కడ కనిపించకపోవటంతో నీటిసంపు వద్దకు వెళ్లిచూడగా అప్పటికే శివ మృతిచెంది ఉన్నాడు. శుభశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

29న కొమ్మాల జాతర వేలం పాటలు

గీసుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మార్చిలో అత్యంత వైభవంగా నిర్వహించే కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 29న జాతర వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. టెండర్‌లో పాల్గొనే వారు కొబ్బరి కాయలు అమ్ముకోవడానికి రూ.1లక్ష, కొబ్బరిచిప్పల సేకరణకు రూ.50 వేలు, తలనీలాల సేకరణకు రూ.20 వేల చొప్పున డీడీలు ముందుగానే చెల్లించాలన్నారు. సీల్డుకవర్ కమ్ వేలం పాట విధానంలో టెండర్‌లు ఇవ్వబడతాయని వివరించారు. ఈ నెల 28 లోపు కార్యాలయం నుంచి టెండర్ ఫాంలు పొందాలని సూచించారు. టెండర్ పొందినవారు మార్చి 6 నుంచి ఏప్రిల్ 6వరకు మాత్రమే జాతరలో అమ్ముకునే హక్కు ఉంటుందని చెప్పారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ఖానాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ధర్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పరీక్షా ప్యాడ్లు, ఎన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రమౌళి, ధర్మరాజ్ ఫౌండేషన్ సేల్స్ ఆఫీసర్లు రాజమౌళి, యాగ్నేశ్వర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

వర్ధన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా కన్నం కుమారస్వామి, అధ్యక్షుడిగా భూక్యా యాకూబ్, ఉపాధ్యక్షుడిగా మేకల రాజు, ప్రధాన కార్యదర్శిగా బానోత్ రమేష్, సహాయ కార్యదర్శిగా ఆబర్ల కుమారస్వామి, కోశాధికారిగా బానోత్ సంపత్‌నాయక్, కార్యవర్గ సభ్యులుగా గారె ప్రతాప్, కంచర శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఎన్నికయ్యారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు యూనిఫాం అందచేత

గీసుగొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచర్ల జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న కరుణ అనే ఉపాధ్యాయురాలు ఎన్‌సీసీ విద్యార్థులకు రూ.75 వేల సొంత ఖర్చులతో యూనిఫాంలను ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ రవిందర్, ఏపీపీసీ చైర్మన్ శిరీష, తానం మనోహర్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

హరీష్‌కు ఇన్నోవేషన్ అవార్డు

సంగెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాట్రపల్లికి చెందిన అప్పలబత్తుల హరీష్‌కు గ్రామీణ ఇన్నోవేషన్ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హరీష్‌కు తహసీల్దార్ రాజ్‌కుమార్ అవార్డును అందచేశారు. గ్రామాల్లో ప్రజలకు తక్కువ ఖర్చుతో నిత్యావసరాలకు ఉపయోగపడేలా పనిముట్లను తయారుచేసిన వారికి ఈ అవార్డును అందచేస్తారు. హరీష్ కరెంట్ అవసరం లేకుండా కర్రతో ట్రెడ్‌మిల్‌ను తయారు చేసినందుకు అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, హరీష్‌ను గ్రామస్థులు ఆదివారం ఘనంగా సన్మానించి అభినందించారు.

పోరాటమే స్ఫూర్తి కావాలి..

(3వ పేజీ తరువాయి)

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.4,170 కోట్లు కేటాయించిందని, అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని అన్నారు. శాంతిభద్రతలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా చర్యలు తీసుకుంటోందని అన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్

ఖుష్‌మహల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. డీఆర్‌డీఏ, ఆర్టీఏ, చేనేత వస్త్ర పరిశ్రమ, సఖీ కేంద్రం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, వైద్యఆరోగ్య శాఖ, ఉద్యాన వన పట్టు పరిశ్రమల శాఖ, వ్యవసాయశాఖ, మెప్మా, వరంగల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తమ సేవలను, ఉత్పత్తులను ప్రదర్శించారు.